**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ 31-03-2026** **సమయం 13.10 గంటలు**

## ముఖ్యాంశాలు

1. తెలంగాణలోని 12 వేల 600 గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల కింద 247.94 కోట్ల రూపాయలు విడుదల చేసింది.
2. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్లుండి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ప్రణాళికా శాఖ ప్రకటించింది.
3. భగవాన్ మహావీర్ జయంతిని ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు.
4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే మూడు రోజులు ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణం కేంద్రం తెలిపింది.

.........................................................

**తెలంగాణ ఆర్థిక సంఘం నిధులు**

రాష్ట్రంలోని 12 వేల 600 గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దిష్ట వినియోగ నిబంధనలు లేని నిధులు- అన్‌టైడ్ గ్రాంట్స్ నుంచి 247.94 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాలకు కలిపి మొత్తం 1500 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయగా, అందులో తెలంగాణకు ప్రత్యేక ప్రాధాన్యత లభించింది. ఈ నిధులతో పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు

మార్గం సుగమమైంది. క్షేత్రస్థాయిలో పాలనను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు ఈ నిధులు ఎంతగానో దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు.

.........NSD

**గ్రామ సభలు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్లుండి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ప్రణాళికా శాఖ ప్రకటించింది. ఈ సభల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, గృహ జ్యోతి వంటి సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, లబ్ధిదారుల అభిప్రాయాలు, సూచనలను స్వీకరించనున్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు చేరడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ గ్రామ సభలకు ప్రజలందరూ తప్పనిసరిగా హాజరై గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం కోరింది.

........డెస్క్

**మహావీర్ - సీఎం**

ప్రపంచానికి అహింస, సత్యం, శాంతి, దయ వంటి మహత్తర విలువలను బోధించిన భగవాన్ మహావీర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహావీర్ జయంతి సందర్భంగా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భగవాన్ మహావీర్ చూపిన మార్గం, ఆశయాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ అహింసా మార్గంలో నడవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

........డెస్క్

**మహావీర్ ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలో మహావీర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు  కాగజ్ నగర్ లో జైనులు, మార్వాడీలు శోభాయాత్ర నిర్వహించారు. మహావీరుడు చూపిన మార్గంలో నడవాలని, ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరు కృషి

చేయాలని పేర్కొన్నారు. మహావీర్ జయంతిని రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహావీర్ జయంతిని ఘనంగా జరుపుకుంటున్నారు.

........పీటీసీ, ఆసిఫాబాద్/సిరిసిల్ల

**కౌశిక్ రెడ్డి-సీఐడీ**

హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పాడి కౌశిక్ రెడ్డికి రాష్ట్ర సీఐడీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. జనవరి 29న సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్ల సమయంలో హుజూరాబాద్‌లోని కె.సి. క్యాంప్ చౌరస్తా వద్ద రహదారిని దిగ్బంధించి, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించడంతో పాటు పోలీసు అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ విధులకు ఆటంకం కలిగించినందుకు కౌశిక్ రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా ఏప్రిల్ 4వ తేదీ లోపు హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ సీఐడీ కార్యాలయంలో విచారణాధికారి ముందు హాజరుకావాలని, దర్యాప్తుకు సహకరించాలని పేర్కొన్నారు.

.........డెస్క్

**తల్లిదండ్రుల బిల్లు-మంచిర్యాల**

తల్లిదండ్రుల సంరక్షణార్థం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన నూతన బిల్లుపై వయోవృద్ధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం పరిధిలోకి ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులను సైతం చేర్చడం ద్వారా వృద్ధుల ఆత్మగౌరవానికి భరోసా లభించిందని వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మొండయ్య అన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల వృద్ధాప్యంలో తమకు ఆర్థిక భద్రతతో పాటు సామాజిక గౌరవం దక్కుతుందని ఆకాశవాణితో అన్నారు.

**సౌండ్ బైట్ మొండయ్య......**

........పీటీసీ, మంచిర్యాల

**పీఎం కిసాస్ సమ్మాస్-షెడ్యూల్డ్ బైట్**

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారు

చింతపంటి అజయ్ చెప్పారు.  22వ విడుత డబ్బులు జమ అయ్యాయని ఆకాశవాణి తో చెప్పారు.

**సౌండ్ బైట్ చింతపంటి అజయ్...........**

.......పీటీసీ, సిరిసిల్ల

**అసెంబ్లీ**

రాష్ట్ర శాసనసభ నిరవధికంగా వాయిదా పడింది. మొత్తం పది రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో 82 గంటల 47 నిమిషాల పాటు బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు.అసెంబ్లీ మూడు తీర్మానాలు చేసింది. 10 బిల్లులకు ఆమోదం తెలిపింది. ఒక బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపింది. ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించింది.

.......డెస్క్

**వాతావరణం-పంట నష్టం**

రాష్ట్రంలో నిన్న రాత్రి కురిసిన కురిసిన అకాల వర్షాల వల్ల ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఆసిఫాబాద్, నిర్మల్, సిరిసిల్ల తదితర జిల్లాల్లో ఈదురు గాలులు  వడగండ్ల వర్షం కారణంగా వరి, మొక్కజొన్న, నువ్వు పంటలు నేలకొరగగా.. మామిడి కా యలు నేల రాలాయి.  చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులుతో కూడిన వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

........పీటీసి ఆసిఫాబాద్ /నిర్మల్/ డెస్క్

**భద్రాచలం శ్రీరామనవమి**

భద్రాచలం శ్రీరామనవమి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిన్న రాత్రి 'దొంగలదోపు' ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. తిరువీధి సేవలో ఉన్న స్వామివారిని అటవీ మార్గంలో దొంగలు అడ్డగించి సొమ్ము దోచుకెళ్లడం.. అనంతరం ఆయన మహిమను గుర్తించి

వాటిని తిరిగి ఇచ్చి శరణు వేడటం వంటి ఘట్టాలను అర్చకులు శాస్త్రోక్తంగా ప్రదర్శించారు. ఈ విశిష్ట వేడుకను చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

.........పిటిసి-భద్రాద్రి కొత్తగూడెం

**సిరిసిల్ల-కలెక్టర్**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రేపటి నుంచి నుంచి మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానం లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇసుక సరఫరా అవుతుందని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు. జిల్లా కమిటీ ఆమోదించిన ఇసుక రీచ్ ల నుంచే ఇసుక తరలించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

.........పీటీసీ, సిరిసిల్ల

**భద్రాద్రి-స్కాలర్షిప్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ పోస్టు మెట్రిక్ స్కాలర్షిప్ రెన్యువల్ దరఖాస్తు గడువును ఏప్రిల్ 20వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు తెలంగాణ ఈ-పాస్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు

..........పీటీసీ- భద్రాద్రి కొత్తగూడెం

**వరగంల్- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ**

ఈ వేసవిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించడానికి అవుటేజీ మేనేజ్మెంట్ పద్ధతిని ఉపయోగిస్తామని టీజీఎన్పీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు 17 సర్కిల్లో ఎస్ఈ లు, డిసీలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అవుటేజీ మేనేజ్మెంట్ పద్ధతి ద్వారా సబ్ స్టేషన్లు, లైన్లు, ట్రాన్స్ఫార్మర్లు ఇలా ఎక్కడైనా సరే అంతరాయాల కేంద్రాన్ని సులువుగా తెలుసుకోవచ్చని, పునరుద్ధరణ చర్యలు చేపట్టవచ్చన్నారు.

........వరంగల్ జిల్లా పి టి సి